




గుంటూరు చుట్టుగుంట వద్ద అన్న క్యాంటీన్ వద్ద పనులు చేస్తున్న కార్మికులు

సీఐల బదిలీల్లో జాగ్రత్త



- తేడా వస్తే మీదే బాధ్యత
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు
- తాజాగా పల్నాడులో మరో 10 మంది సీఐల బదిలీలు నిలిపివేత

గుంటూరు, జూలై 22 : సీఐల బదిలీల విషయంలో తేడా వస్తే మీరే బాధ్యత వహించాలి... ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించండి... గడిచిన ఐదేళ్లలో వైసీపీకి అంటకాగిన వారిని దూరంగా ఉంచండి... సీఐల పోస్టింగ్స్ విషయంలో మీడియాలో విమర్శలు, ఆరోపణలు రాకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోండి... అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన హెచ్చరికలు జిల్లాలోని ఎమ్మెల్యేలలో చర్చనీయాం శంగా మారాయి. ఇటీవల కాలంలో గుంటూరు రేంజిలో జరుగుతున్న సీఐల బదిలీల విషయంలో పత్రికల్లోనూ, పార్టీ శ్రేణుల నుంచి సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. మునుపెన్నడు లేనివిధంగా గడిచిన ఐదేళ్లలో పోలీస్ శాఖ విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి సర్వత్ర తీవ్ర విమర్శలపాలైంది. ముఖ్యంగా ఓ సామాజిక వర్గాన్ని పూర్తిగా అణిచివేయడమే గాక టీడీపీకి అనుకూలంగా ఉంటారనో, తటస్థంగా పనిచేస్తారనో భావించి అనేకమంది పోలీస్ అధికారులను వీఆర్‌లోకి పంపి కనీసం జీతాలు కూడా లేకుండా వేధింపులకు గురి చేశారు. అందులో ఒక సామాజిక వర్గం ఏక మొత్తంగా ఉండగా మిగిలిన వివిధ సామాజిక వర్గాలు వారు కూడా బాధితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా అధికారులతో పాటు పార్టీ శ్రేణులు, అదేవిధంగా ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరికీ న్యాయం చేస్తారని భావించారు. అయితే ఊహించని విధంగా పార్టీ ఎమ్మెల్యేలు తీసుకున్న నిర్ణయం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికే గాక ఆగ్రహానికి కూడా గురి చేసింది. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో వైసీపీనే అధికారంలోకి వస్తుంది, జగన్ ముఖ్యమంత్రి అవుతారు, ఇంకెక్కడ తెలుగుదేశం అంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన అనేకమంది సీఐలు, చివరకు ఎన్నికల సమయంలోనూ వైసీపీ గెలుపు కోసం తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే ఆయా సీఐలకు కూటమి ప్రభుత్వంలో మిగిలిన వారి కంటే ముందుగానే సీఐల బదిలీల ప్రక్రియ కంటే ముందే పలుచోట్ల పోస్టింగ్స్ వస్తుండటంతో పార్టీ కార్యకర్తలతో పాటు ఆరోజు ఆయా అధికారులతో కలిసి పనిచేసిన పోలీస్ సిబ్బంది లోనూ సర్వత్ర విస్మయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే వారం రోజుల క్రితం పల్నాడు జిల్లాలో పదిమంది సీఐలను నియమిస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అందులో చాలామంది గడిచిన ఐదేళ్లలో వివిధ పోలీస్‌స్టేషన్లలో సీఐలుగా కొనసాగిన వారు ఉండడంతో తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. పార్టీ శ్రేణులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

మరోవైపు సోషల్ మీడియాలోనూ వీటికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో నియమించిన పదిమంది బదిలీలను నిలిపివేశారు. ఈ విధంగా రేంజి పరిధిలో బదిలీల విషయంలో ఎమ్మెల్యేలు తప్పటడుగులు వేస్తుండడం వివాదాస్పదంగా మారుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో సీఐలుగా బాధ్యతలు నిర్వహించిన వారికి కూడా ఎమ్మెల్యేలు పేర్లు ఇవ్వడం ప్రస్తుతం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయా ఎమ్మెల్యేలకు ఏ సామాజిక వర్గం వారు కావాలనుకుంటున్నారో అదే సామాజిక వర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారికి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. బదిలీల విషయంలో డబ్బులు అందుకున్న దళారులు మాటలు నమ్మటమో లేదంటే తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో లేదంటే ఎవరో సిఫార్సు చేశారని ఎమ్మెల్యేలు అటువంటి వారికి పోస్టింగ్స్ ఇప్పిస్తే ఆయా ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు టార్గెట్ అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి పరిణామాలను ముందే గ్రహించిన సీఎం చంద్రబాబు తాజాగా బదిలీల విషయంలో ఎమ్మెల్యేలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఐల బదిలీల విషయంలో అటు ఎమ్మెల్యేలు, ఇటు అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని కార్య కర్తలు పార్టీ నాయకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

త్వరలో.. అన్న క్యాంటీన్లు



వైసీపీ పాలనలో అన్న క్యాంటీన్ల దుస్థితి

అవి 5 రూపాయలకే పేదలకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అక్షయపాత్రలు కేవలం 15 రూపాయలతో మూడు పూటలా కడుపులు నింపే అన్న క్యాంటీన్లు.. అలాంటి అన్న క్యాంటీన్లు గత వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపులకు బలై పోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేసి వారిని ఆకలి, పస్తులపాలు చేశాయి. అయితే ఐదేళ్ల పాటు అన్న క్యాంటీన్లకు పట్టిన గ్రహణం త్వరలో వీడ బో తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు మొదల యింది. తొలి ఐదు హామీల్లో ఒకటైన అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు పూనుకుంది. ఈ ఏడాది ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కాగా గతంలో ఏర్పాటు చేసిన 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు 10 నాటికి సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల అధికారులను ఆదేశిం చారు. ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లకు మరమ్మ తులు చేసి, రంగులు వేసి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

- ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు కసరత్తు
- నియోజకవర్గానికి 3 క్యాంటీన్ల ఏర్పాటుపై దృష్టి
- ఇప్పటికే ప్రతిపాదనలు అందజేసిన మున్సిపాలిటీలు
- 2018లో ఉమ్మడి జిల్లాలో 29 ఏర్పాటు
- శిథిలమైన క్యాంటీన్లను పునర్నిర్మిస్తున్న అధికారులు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పురపాలక సంఘాల్లో మొత్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు రూ. 5 రూపాయలకే టిఫిన్, భోజనం లభించేది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం ఈ అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి కూడా మధ్యాహ్నం పూట అన్న క్యాంటీన్లలో రూ. 5కే అన్నం లభించడంతో వారికి కూడా ఆర్థికభారం తప్పేది. ఇలా ప్రతి రోజూ ఒక్కో అన్న క్యాంటీన్ 1500 నుంచి 2000 వేలమందికిపైగా ప్రజలకు ఆకలి తీర్చేవి. వీధులవెంట, రైల్వేస్టేషన్లు, బస్టాండుల్లో జీవించే నిరాశ్రయులు, నిరుపేదలు, భిక్షాటకులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి.

- గుంటూరులోని మిర్చియార్డులో, గోరంట్ల ఐడీ ఆసుపత్రి వద్ద, చిలకలూరిపేటలో రెండు చోట్ల, నరసరావుపేటలో రెండు చోట్ల, తెనాలిలో రెండు చోట్ల, రాష్ట్ర హైకోర్టు, సచివాలయం, కరకట్ట వద్దనున్న ముఖ్యమంత్రి నివాసం సహా జిల్లాలో 13 పట్టణాల్లో 29 అన్నా క్యాంటీన్లను గత టీడీపీ ప్రభుత్వం 2018లో ప్రారంభించింది. కాగా వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ పాడుబెట్టింది. ఫలితంగా అనేక చోట్ల క్యాంటీన్లు శిథిలమైపోయాయి. కొన్నింటిని సచివాలయాలుగా మార్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. పాడుబడిపోయిన భవనాలకు రంగులు వేసి మున్సిపల్ అధికారులు కొత్త రూపురేఖలు తెస్తున్నారు. శిథిలమైనవాటిని పునర్నిర్మిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 అన్న క్యాంటీన్లు ఉండేలా చర్యలు చేపడుతోంది. ఆగస్టు 15 నుంచి వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరగా, స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బస్టాండు సెంటర్లో ఒకటి, ఆటోనగర్‌లో ఒకటి, మార్కెట్ సెంటర్లో ఒకటి, పశ్చిమ నియోజకవర్గంలో మిర్చియార్డులో ఒకటి, చుట్టుగుంటలో ఒకటి, గుజ్జనగుండ్లలో ఒకటి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలో ఒకటి చొప్పునఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.



గుంటూరు బస్టాండు వద్ద అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తాను కొనసాగిస్తానని, తన తండ్రి పేరుతో వాటిని రాజన్న క్యాంటీన్లుగా నడుపుతానని చెప్పిన గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసేశారు. అధికారంలోకి వచ్చిన రోజుల్లో రంగులు మార్చి అన్న క్యాంటీన్ పేరును రాజన్న క్యాంటీన్‌గా మార్చి హడావుడి చేసినా, ఆ తరువాత వాటిని నిర్దాక్షిణ్యంగా మూసేశారు. దీంతో పేదలకు పట్టెడన్నం కూడా లభించడం గగనమైపోయింది. టీడీపీ నేతలు కొందరు తమ వ్యక్తిగత చొరవతో సొంత డబ్బులతో ఏర్పాటు చేసినా వాటిని అక్కసుతో వైసీపీ నేతలు కూల్చేశారు. పేదల నోటి దగ్గర కూడు లాగేశారు. దీనిపై విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గింది. దీంతో గుంటూరులో 4 చోట్ల, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, చిలకలూరిపేట సహా అనేక పట్టణాల్లో టీడీపీ నేతలు సొంత ఖర్చుతో అన్న క్యాంటీన్లు నడిపారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్ల కొనసాగింపుకు చర్యలు చేపడుతోంది.



తెరచాటు దోస్తీ.. పదవి కోసం కుస్తీ

- నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నేతల ఆరాటం
- అనర్హులే రేసులో ముందంజ
- పార్టీలో సభ్యత్వం లేకున్నా జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కావాలంట
- అదేమంటే కులం కార్డు ప్రయోగిస్తూ బెదిరింపు
- మోపిదేవి, రజినీతో అంటకాగిన నేతలపై లోకేశ్ గుర్రు
- ఎంపీ అభ్యర్థుల వద్ద మాత్రం ఫొటోలకు ఫోజులు
- పనిచేయని వారికి పదవులు ఎలా అంటున్న ఎమ్మెల్యేలు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం నేతల తాకిడి ఎక్కువైంది. ఎక్కడ ఇద్దరు ముగ్గురు నాయకులు తారసపడ్డా ప్రస్తుతం ఇదే అంశంపై చర్చ నడుస్తుంది .చివరకు మండల స్థాయిలోని చోటా మోటా నాయకులు కూడా రాబోయే పదవుల మీద ఊహాగానాలు చేస్తున్నారు .తెలుగుదేశం పార్టీలో ఈసారి నామినేటెడ్ పదవు లు కోరే నేతల జాబితా చాంతాడు లా పెరిగిపోయింది 2019 ఎన్నికల తర్వాత పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నేతలతో పాటు, అటు ఇటు పక్క చూపులు చూసిన వారు కూడా నామినేటెడ్ పదవుల కోసం పోటీలోకి రావటం చర్చనీయాంశంగా మారింది . వాస్తవానికి కొందరు నేతలు గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బం దులు పడ్డారు. అనేక రకాల అక్రమ కేసులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు . పార్టీ కోసం సొంత డబ్బు ఖర్చు చేసి మరీ విజయానికి కృషి చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల కోసం తెలుగుదేశం పార్టీ సన్నాహాలు చేస్తుందన్న వార్తలు అటువంటి నాయకుల్లో ఆనందాన్ని కలిగించాయి. ఆయా నాయకులు వారి వారి స్థాయికి తగ్గట్టుగా పదవులను ఆశిస్తూ స్థానిక ఎమ్మెల్యేలకు మనసులోని మాటను చేరవేశారు. కొంతమంది ఎమ్మెల్యేలు వారి పరిధిలోని నాయకులకు పదవులపై క్లారిటీ కూడా ఇచ్చారు. ఆ మేరకు అధిష్టానానికి లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. అయితే గత ఎన్నికల తర్వాత కొంతమంది నేతలు వైసీపీ ముఖ్య నేతలతో టచ్ లోకి వెళ్లారు. గడచిన ఐదేళ్ల ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వారితో సంబంధాలను పెట్టుకున్నారు . తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి పొత్తు ఖరారు అయిన తర్వాత అటు వంటి నేతలు తిరిగి సైకిల్ వైపు చూశారు. ప్రస్తుతం పదవులు ఆశిస్తున్న వారిలో అటువంటి వారే ఎక్కువగా పావులు కదుపు తున్నారన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతున్నది.

పనిచేయని వారికి నో ఛాన్స్

గత ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో ఎవరెవరు ఎంత మేరకు పనిచేశారు అనేది ఎమ్మెల్యేలకు పూర్తిగా అవగాహన ఉంది. కొంత మంది నేతలు ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో పని చేయకుండా కేవలం ఫోటోలుకే పరిమితం అవుతూ వచ్చారు. ఓటర్లను కలిసి ఎక్కడా కూడా వారిని ప్రభావితం చేసిన పరిస్థితులు లేవన్నది కొంతమంది ఎమ్మెల్యేల వాదన. అటువంటి వారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదని వారు తెగేసి చెబుతున్నారు. పనిచేయని వారికి పదవులు ఇస్తే పనిచేసిన కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యేల వాదన. కొందరు నాయకులు ఎన్నికల్లో కేవలం ఎంపీ అభ్యర్థులు వచ్చినప్పుడు మాత్రమే ఫోటోల్లో కనపడుతూ వచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం పనిచేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. అటువంటి వారికి పదవులు ఇచ్చే విషయంలో పార్టీ అధిష్టానం ఏ విధంగా ముందుకు వెళుతుంది అనేది అర్థం కాని సంగతి. కొందరు టీడీపీ నేతలకు గతంలో వైసీపీ ఎంపీ మోపిదేవి రమణతో వ్యాపార సంబంధాలు ఉన్నాయనేది ఆరోపణ. అలాగే అప్పటి మంత్రి రజినీతో అంటకాగిన వారు ఉన్నారు. ప్రస్తుతం ఇతర పార్టీ నేతలతో వ్యాపార సంబంధాలు నెరపే వారు కూడా ఉన్నారు. అయితే సదరు సమాచారం నారా లోకేశ్ వద్ద ఉన్నట్లు వినికిడి. ప్రస్తుతం ఆ నేతల్లో ఒకరు ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నిస్తుండగా...అతని దరఖాస్తు కంటే ముందే.. అతని ప్రత్యర్థులు ఫిర్యాదులు అధిష్టానానికి చేరినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వెంట కొందరు నేతలు తిరు గుతూనే శల్యసారధ్యం వహించారు... గుంటూరుపశ్చిమలో అయితే కొందరు టీడీపీ నేతలు వైసీపీ అభ్యర్థిగా ఉన్న మంత్రి రజినీతో లోపాయి కారీ ఒప్పందాలు పెట్టుకున్నారు. ఈ సమాచారం ఎమ్మెల్యే మాధవి దృష్టిలో ఉండటంతో నామినేటెడ్ పదవుల విషయంలో తమకు న్యాయం జరగదేమోననే ఆం దోళనలో నేతలు ఉన్నారు.

పార్టీ సభ్యత్వం లేకున్నా..

సాధారణంగా ఏ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి పొందాలన్న ఆయా వ్యక్తులు ఎంతో కాలంగా పార్టీలో కష్టపడి పనిచేసిన వారై ఉండాలి. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం ఈ మధ్యకాలంలో ఒకరు దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది .ఆయనకు కనీసం పార్టీ సభ్యత్వం కూడా లేకపోవడం గమనించదగ్గ విషయం. అయితే సదరు వ్యక్తి జిల్లా అధ్యక్ష పదవి పొందేందుకు కులం కార్డును బలంగా ప్రయోగిస్తున్నట్లు సమాచారం. అటువంటి వ్యక్తులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని మిగిలిన నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వడపోత జరిగేనా..

సాధారణంగా తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం ఎప్పుడూ పోటీ ఎక్కువగానే ఉంటుంది. అయితే భారీ వడపోత తర్వాత పదవులను కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈసారి వడపోత జరుగుతుందా లేదా అనేది చాలామందిలో సమాధానం దొరకని ప్రశ్నగా కనిపిస్తుంది . ప్రస్తుతం నామినేటెడ్ పదవులకు దరఖాస్తు చేసిన వారిలో అనర్హులే ఎక్కువ మంది ఉండటంతో ఈ ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఒకవేళ అర్హులను పక్కనపెట్టి అనర్హులకు పదవులు దక్కితే ఏమిటన్న సందేహం కార్యకర్తల్లో కనపడుతున్నది . అయితే సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం ఆయా మార్గాల ద్వారా జిల్లాలో నామినేటెడ్ పదవులకు అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలేవి..



- వర్షాలతో పెరిగిన దోమలు
- మేల్కొనకపోతే ప్రమాదమే
- కట్టడికి కదలని మున్సిపల్ సిబ్బంది

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారుల్లో.. ఖాళీ స్థలాలు.. గుంతల్లో నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగింది. మున్సి పాలిటీ, పంచాయతీల అధికారులు తక్షణం చర్యలు తీసుకోకుంటే జనం రోగాలబారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాల్లో జ్వరాల కేసులు వెలుగు చూస్తున్నాయి. అక్కడక్కడ డెంగీ, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. పట్టణాల్లో పారిశుద్య కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా.. తొలగించే పరిస్థితి లేదు. పురపాలక సంఘాల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దోమల నివారణకు నిధులు కేటాయించడం లేదు. మురుగు కాలువలు పూడికతో నిండాయి. పూడిక తీసేందుకు మునిసిపాల్టీలు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అంతగా కనిపించడం లేదు. మున్సి పాలిటీలు, పంచాయతీల పరిధిలో దోమల నివారణకు చేయాల్సిన ఫాగింగ్ జరగడం లేదు. ఫాగింగ్ యంత్రాలను మూలన పడేశారు. అన్ని మునిసిపాల్టీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఫాగింగ్ పేరు తో తిప్పే వాహనాల కు ఇంధనం కోసం బోగస్ బిల్లు లు తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న సంఘ టనలున్నాయి.



నరసరావుపేట మున్సిపాలిటీలో పాడుబెట్టిన పాగింగ్ యంత్రం

కానరాని ప్రత్యేక కార్యక్రమాలు

తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న 2014-19 మధ్య కాలంలో 'దోమలపై దండ యాత్ర' పేరుతో నివారణ చర్యలు మునిసి పాల్టీలు చేపట్టేవి. ఇవి ప్రజలను ఎంతో ఆలోచింపచేసేవి. ప్రతి శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే నిర్వహించేవారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి.. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. నీటి తొట్టెలు, పాత్రలను తెరిచి ఉంచడం, టెంకాయ చిప్పలు, టైర్లలో నీరు నిలిచి ఉండటం తదితరాలతో వచ్చే అనర్థాలను జనాలకు వివరించే వారు. నీటి గుంతల్లో దోమల వ్యాప్తి నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించే వారు. ప్రస్తుతం ఇలాంటివి కనిపించడంలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది.. కేసులు వచ్చిన చోట ఏం చేయాలి.. భవిష్యత్తు కార్యచరణ ఏమిటి.. అనే ఆలోచన మునిసిపల్ యంత్రాగానికి లేకపోవడం గమనార్హం.

ఎన్‌డీబీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేనా!


- రూ.35.96 కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరే
- రెండేళ్ల అగ్రిమెంట్ సమయం ముగిసినా పూర్తికాని పనులు

6లో..

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

- రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు ఉండొచ్చని అంచనా
- నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 8600 క్యూసెక్కుల వరదనీరు


ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, జూలై 22: ప్రకాశం బ్యారేజి దిగువకు వరదనీటి విడుదల సోమవారం కూడా కొనసాగుతోంది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర తదితర వాగుల నుండి 12వేల 300క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 12 గేట్లను అడుగుమేర ఎత్తి 8వేల 600క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

జగన్‌రెడ్డి.. నీకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కుందా?

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 22: జగన్‌మోహన్‌రెడ్డి.. నీకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు ఉందా? అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తులలో ఏవరైనా ఉన్నారంటే మొదటి వరుసలో జగన్‌రెడ్డి ఉంటారన్నారు. అసెంబ్లీలో నీ బూతుల మంత్రులతో గౌరవసభను కౌరవసభగా మార్చి, సభ్య సమాజం తలదించుకునేలా అసెంబ్లీని మార్చిన నువ్వు రాజ్యాంగం, విలువల గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు. సభా సాంప్రదాయాలు తెలియని నువ్వు, సభలో ఎలా ప్రవర్తించాలో ముందు నేర్చుకుని తరువాత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. నిన్నటివరకు పోలీసు వ్యవస్థను చెప్పు చేతులలో పెట్టుకొని నాటి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై ఇష్టానుసారం కేసులు పెట్టి జైలుకు పంపించిన నువ్వు నేడు అదే పోలీసులకి నీతులు చెప్పడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక ఐఏఎస్ అధికారిని మోకాలుపై కూర్చోబెట్టిన నువ్వు నేడు పోలీసులకు మూడు సింహాల గురించి చెప్తుంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేయడానికి వినుకొండ విషయాన్ని తెరపైకి తెచ్చి డిల్లీలో ధర్నా చేస్తామంటున్నావని, చంద్రయ్య పీక కోసిన రోజు, డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిగా ముద్రవేసి నడిరోడ్డుపై బట్టలిప్పిన రోజు, సుబ్రహ్మణ్యం అనే డ్రైవర్ శవాన్ని మీ ఎమ్మెల్సీ డోర్‌డెలివరీ చేసిన రోజు, అమర్నాథ్‌గౌడ్ అనే విద్యార్థిని పెట్రోల్ పోసి తగలబెట్టిన రోజు ప్రజాస్వామ్య విలువలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.

ఎన్‌డీబీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేనా!

● రూ.35.96 కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరే

● రెండేళ్ల అగ్రిమెంట్ సమయం ముగిసినా పూర్తికాని పనులు


ఎన్‌డీబీ నిధులు మంజూరైనా నిర్మాణం జరగని తెనాలి - సిరిపురం రోడ్డు

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నిధులతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేపట్టిన పలు రోడ్ల నిర్మాణపనులు పూర్తిచేస్తారో, చేయరో తెలియని పరిస్థితి కొనసాగుతున్నది. పనులు దక్కించుకొన్న నిర్మాణసంస్థ అగ్రిమెంట్ సమయం అయిపోయినా పూర్తి చేయలేకపోయింది. ఇందుకు బిల్లుల చెల్లింపు జరగని పరిస్థితిని సాకుగా చూపిస్తున్నది. ఎన్‌డీబీ కింద ఆయా రోడ్లు మార్కింగ్ అయి ఉండటంతో కనీసం ప్యాచ్‌వర్కులు కూడా ఆర్‌అండ్‌బీ శాఖ చేయలేని పరిస్థితి నెలకొన్నది. వర్షం కురిస్తే కనీసం ఆ రోడ్లలో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై ఏర్పడిన గుంతలలో కూరుకుపోయి వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతున్నా యి. అరకొరగా చేసిన పనులు నామరూపాలు లేకుండా పోయాయి. 2021 మార్చిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ రోడ్ల పనులు రెండేళ్లలో పూర్తికావాల్సి ఉండగా కనీసం 25శాతం కూడా పూర్తికాలేదు. కొన్ని రోడ్లు సీఆర్‌డీఏ పరిధిలోకి వస్తాయని చెప్పి వాటిని చేపట్టనేలేదు. అరకొరగా జరిగిన పనులకు ఏకంగా రూ.35.96 కోట్లకు బిల్లులు పెట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టు ఏజెన్సీ దాదాపుగా పనులను చాప చుట్టేసింది.

ఎన్‌డీబీ నిధుల కింద జిల్లాకు మొత్తం 13 రోడ్లు మంజూరయ్యాయి. వాటిల్లో తాడికొండ-రాయపూడి, తుళ్లూరు-అమరావతి, మంగళగిరి-తాడికొండ వయా నీరుకొండ, రేవేంద్రపాడు - సీతానగరం రోడ్డు, చేబ్రోలు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు వయా ముట్లూరు, వట్టిచెరుకూరు రోడ్డు, ఓఎం రోడ్డు నుంచి వల్లూరు వయా జీజీ పాలెం - రావిపాడు, వంగిపురం, ఉన్నవ నుంచి జీసీ రోడ్డు వరకు, గనికపూడి-ఉన్నవరోడ్డు, ప్రత్తిపాడు-యడ్లపాడు, పొన్నూరు-పాంఢ్రపాడు, నిడుబ్రోలు-చందోలు, తెనాలి-సిరిపురం, చిలకలూరిపేట-కోటప్పకొండ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్ల పొడవు 95.147 కిలోమీటర్లు కాగా రూ. 227.29 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయి. కాగా రూ.194.16 కోట్లతో అంచనాలు రూపొందించి టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన ఒక నిర్మాణ సంస్థకు కట్టబెట్టారు. రూ.121.46 కోట్లుగా అగ్రిమెంట్ విలువని నిర్ణయించారు. గత ఏడాది మార్చి 22వ తేదీకే పనులు పూర్తికావాల్సి ఉన్నది.

కాగా సీఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నాయని చెప్పి తాడికొండ-రాయపూడి, తుళ్లూరు-అమరావతి రోడ్ల పనులను చేపట్టలేదు. మంగళగిరి-తాడికొండ రోడ్డులోనూ 5నుంచి 11వ కిలోమీటర్ వరకు సీఆర్‌డీఏలో ఉందని ఆ పనిని కూడా చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశారు. రేవేంద్రపాడు-సీతానగరం రోడ్డుని పూర్తిచేసినట్లు ప్రభుత్వానికి నివేదించారు. మిగతా పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటివరకు రూ.35.96కోట్ల విలువ కాగల పనులు పూర్తిచేసినట్లు బిల్లులు పెట్టారు. వాటిల్లో రూ.20.9 కోట్లు డ్రా అయ్యాయి. మరో రూ.12.88కోట్లు సీఎఫ్‌ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మరో రూ.2.22కోట్లకు బిల్లులు సిద్ధం చేశారు. కాగా ఎన్‌డీబీ నిధులను గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్‌ఎంస్‌కి దారిమళ్లించి వేరే అవసరాలకు వినియోగించేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో పనులు నిలిపేసినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి పనులు పూర్తిచేసేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రూ.60 లక్షలకు పోస్టల్ ఉద్యోగి కుచ్చుటోపి

● డబ్బులిప్పించి ఆదుకోవాలి : సిరిపూడి పోస్టాఫీస్‌లో బాధితుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిరిపూడి పోస్ట్ ఆఫీస్ బాధితులు

బాపట్ల, జూలై 22: నగరం మండలం సిరిపూడి పోస్టాఫీస్ పరిధిలో రూ.60లక్షల వరకు పొదుపు చేసి మోసపోయామని 70మంది బాధిత మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. మోసపోయిన తీరును కలెక్టర్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. బాధితుల కథనం మేరకు.. తాము చెల్లించిన డబ్బులు పోస్టల్ ఖాతాలో సంబంధిత పోస్టల్ ఉద్యోగి జమచేయలేదని ఆరోపించారు. పోస్టల్ ఉద్యోగి బడుగు గోపి మనోజ్‌వర్మపై చర్యలు తీసుకొని డబ్బులు మొత్తం తిరిగి ఇప్పించాలని కోరారు. గ్రామీణప్రాంతమైన సిరిపూడిలో గత 30 సంవత్సరాలుగా పోస్టాఫీస్ నడుస్తున్నదని, పేదప్రజలు, వ్యవసాయకూలీలు, చేతివృత్తిదారులు పోస్టాఫీస్‌లో నెలకు రూ.1000 చొప్పున పొదుపు చేసుకున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.హెచ్.మణిలాల్ తెలిపారు. లక్ష నుండి రూ.4లక్షల వరకు డిపాజిట్‌లు కూడా చేశారన్నారు. గత 10 సంవత్సరాలుగా పొదుపు చేసుకుంటే పోస్టాఫీస్ ఉద్యోగిగా గోపిమనోజ్‌వర్మ వచ్చినప్పటి నుండి ఖాతాదారుల పాస్‌పుస్తకాలలో డబ్బులు జమ అయినట్లు రాసిస్తూ హెడ్‌పోస్టఆఫీస్‌లో జమచేయటంలేదన్నారు. ఆన్‌లైన్ చేయకుండా మోసం చేశారన్నారు. నెలరోజుల క్రితం డిపాజిట్ డబ్బులు విత్‌డ్రా కోసం ఒక ఖాతాదారుడు పోస్టల్ ఉద్యోగిని అడగగా ఆన్‌లైన్ కాలేదు, టెక్నికల్ సమస్య, సర్వర్ పనిచేయటంలేదంటూ వారం రోజులు తిప్పుకోవటంతో సదరు ఖాతాదారులు పిట్లలవానిపాలెం పోస్టఆఫీస్ వద్ద చెక్ చేయించుకుంటే డబ్బులు జమకాలేదని తెలిసిందన్నారు. దీంతో ఖాతాదారులంతా చెక్ చేసుకుంటే మోసపోయినట్లు తెలిసిందన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. లేకుంటే బాధితులతో పోరాటకమిటి ఏర్పాటుచేసి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొప్పుల గోపి, బాధితులు మల్లేశ్వరి, అంజలి, దివ్య, గోపి, సాల్మన్‌రాజు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఏఎన్‌యూ రెక్టార్‌గా ప్రొఫెసర్ రత్న షీలామణి

● రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సింహాచలం

● దూరవిద్య డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

● వర్సిటీలో పలు పాలనా పదవులు భర్తీచేసిన వీసీ గంగాధర్‌రావు


పదవులు పొందిన అధికారులతో వర్సిటీ వీసీ ఆచార్య గంగాధర్‌రావు

పెదకాకాని, జులై 22: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన పదవులను ఇన్‌ఛార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధర్ రావు సోమవారం భర్తీ చేశారు. ఈ పదవులన్నీ తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఉంటాయని పేర్కొన్నారు. వీటిల్లో రెక్టార్‌గా ప్రొఫెసర్ కే రత్నషీలామణి, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కృష్ణసత్య, పీజీ పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం.సుబ్బారావు, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సుధాకర్, సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ వీ రవికుమార్, బాబు జగ్జీవన్‌రామ్ చైర్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ రత్నాకర్, యూజీసీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం త్రిమూర్తిరావు, దూరవిద్య కేంద్రం స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ లింగరాజులు నియమితులయ్యారు.

లంక గ్రామాలకు పడవల ద్వారా ప్రయాణం


కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు

కొల్లిపర, జూలై 22: ప్రకాశం బ్యారేజి నుండి కృష్ణానది దిగువకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం లంక రేవుల్లోకి నీరుచేరింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. రైతులు కృష్ణానదిలో నిర్మించుకున్న గాలుమార్గాలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో పడవల ద్వారా లంక గ్రామాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. మండల యంత్రాంగం, ఆర్‌సీ అధికారులు అప్రమత్తమయ్యారు. రేవుల్లోకి ఎవరూ వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పడవ నడిపే జాలర్లు తగు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.

వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయిన గాలుమార్గం


గాజుల్లంక వద్ద వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయిన శ్రీకాకుళం గాలుమార్గం

కొల్లూరు, జూలై 22: కృష్ణానదిలో శ్రీకాకుళం వైపు వేసిన గాలుమార్గం వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసిన వరదనీరు మండల పరిధిలోని గాజుల్లంక వద్ద కృష్ణానదిలో చేరింది. గాజుల్లంక నుంచి శ్రీకాకుళంకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన గాలుమార్గం వరదఉధృతికి కొట్టుకుపోయింది. నదిలో పడవలు తిరిగేందుకు కూడా పూర్తిస్థాయిలో వరద నీరు లేకపోవడంతో శ్రీకాకుళం వెళ్లాలంటే మండల ప్రజలకు 40కి.మీ. దూరం పెరిగింది. పెనుమూడి మీదుగా పులిగడ్డ వెళ్లి అక్కడ నుంచి శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంది.

శాసనమండలి ప్రతిపక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు, జూలై 22: ఎమ్మెల్సీ, మాజీ విప్, వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్ లేళ్ళ అప్పిరెడ్డి మండలిలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ నిర్ణయం తీసుకొన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితం కావటంతో శాసనసభలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శాసనమండలిలో వైసీపీకి సంఖ్యాబలం ఉండటంతో అధినేత జగన్ మండలిలో ప్రతిపక్షనేతగా అప్పిరెడ్డికి అవకాశం కల్పించారు. ఇకపై కేబినెట్ హోదాలో మండలిలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించనున్నారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెంనకు చెందిన అప్పిరెడ్డి విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006లో వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) చైర్మన్‌గా లేళ్ళ అప్పిరెడ్డి నియామకానికి జగన్ సిఫార్సు చేశారు. అనంతర పరిణామాల నేపథ్యంలో వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2020లో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో ఆయనకు ఎమ్మెల్సీ కట్టబెట్టారు. 2023లో శాసనమండలి విప్‌గా కూడా వ్యవహరించారు. తాజాగా ఆయన శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మిర్చిలోడు లారీ డ్రైవర్ కిడ్నాప్, హత్య

● పోలీసుల అదుపులో నిందితులు

● డ్రైవర్‌ను హత్య చేసి భద్రాచలం వద్ద గోదావరిలో వేశామని వెల్లడి..?


ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన హతుడి భార్య, కుటుంబ సభ్యులు

గుంటూరు, జూలై 22: నగరానికి చెందిన లారీ డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి హత్యచేసి మృతదేహాన్ని భద్రాచలం వద్ద గోదావరిలో వేసిన ఘటన కలకలం రేపుతోంది. నగరంలోని నల్లచెరువు సుగాలికాలనీకి చెందిన రామావత్ వలియానాయక్ లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 18న మధ్యాహ్నం ఇంటినుంచి మిర్చిలోడు లారీకి వెళ్ళాడు. అదేరోజు సాయంత్రం మిర్చియార్డ్ వద్ద మిర్చిలోడ్ చేసుకొని పాట్నా బయలుదేరాడు. రాత్రి 9గంటలకు ఏలూరు దాటినట్లు ఫోన్లో చెప్పాడు. ఆ తర్వాత నుంచి తన భర్త నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు వచ్చిందని ఆయన భార్య బిచాని తెలిపారు. తర్వాత రోజు ఉదయం 7.30 సమయంలో ఫోన్ చేయగా అప్పుడు కూడా ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో లారీ యజమాని సాజిద్‌కు ఫోన్‌చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసిందని, తాము అక్కడికి వెళ్లి విచారించిన తర్వాత అన్ని విషయాలు చెబుతానని చెప్పాడన్నారు. ఆ తర్వాత యజమానికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఆయన నుంచి సమాచారం రాలేదన్నారు. దీంతో 19న నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. ఆ తరువాత పోలీసులను సంప్రదించగా వారు ఈ కేసు భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో విచారిస్తున్నట్లు చెప్పారన్నారు. దీంతో తమ బంధువులు భీమడోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళగా తన భర్తను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి చంపి భద్రాచలం ప్రాజెక్టులో మృతదేహాన్ని పడేసి లారీని అపహరించుకుని వెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు చెప్పారన్నారు. అయితే లారీలో తన భర్తతోపాటు ఉన్న క్లీనర్ ఏమయ్యాడో కూడా తెలియడం లేదన్నారు. ఓసారి ఆయనను కూడా చంపామని చెప్పారని, మరోసారి ఆయనను కొట్టి వదిలేసామని అంటున్నారని బాధితురాలు వాపోయారు. నిందితులు తన భర్తను చంపితే పోలీస్ అధికారులు వెంటనే స్పందించి తన భర్త మృతదేహాన్ని గుర్తించాలని ఆమె కోరారు. లారీ డ్రైవర్‌ను హత్య చేసి లారీని అపహరించుకు వెళుతుండగా పోలీసులు లారీతో సహా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని స్వర్ణభారతినగర్‌కు చెందిన పల్లపు హరికృష్ణ, ప్రకాశం జిల్లా పోతవరానికి చెందిన గుంటూరు నూతన్‌కుమార్, కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన బల్ల తేజ్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకి చెందిన కె మణికంఠలను భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను భీమడోలు పోలీసులు విచారించగా తాము లారీ డ్రైవర్ను హత్య చేసి మృతదేహాన్ని భద్రాచలం ప్రాజెక్టులో పడేసినట్లు చెప్పారన్నారు. ఇదిలాఉంటే లారీలోని మిర్చి ఖరీదు సుమారు రూ.13లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. తాము స్వాధీనం చేసుకున్న మిర్చిలోడును సంబంధిత యజమానికి అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

● అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించే అవకాశం

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వ ఎన్‌డీఏ ప్రభుత్వం మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్రానికి ముఖ్యంగా అమరావతి రాజధాని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్మాణదశలో ఉన్న రైల్వేప్రాజెక్టులు, గతంలో మంజూరై ఇంకా అడుగు ముందుకుపడని రైలుమార్గాలు, రహదారులకు నిధుల కేటాయింపుపై అందరూ ఆశలు పెట్టుకొన్నారు. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఏమేరకు నిధులు కేటాయించారనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్ మంగళవారం పార్లమెంట్ ముందుకురానుంది. ఎన్‌డీఏ-1లో టీడీపీ భాగస్వామ్యమై అమరావతి రాజధానికి నిధులు రాబట్టింది. అలానే గుంటూరు నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అమరావతి స్మార్ట్‌సిటీకి నిధుల కేటాయింపు జరిగాయి. మంగళగిరి ఎయిమ్స్ కూడా అప్పుడే నిర్మాణం ప్రారంభమై అనతికాలంలోనే పూర్తైంది. అలానే ఆంధ్రప్రదేశ్ విభజనచట్టంలో కేంద్రసంస్థలు కూడా కొన్నింటిని గుంటూరు జిల్లాలోనే ఏర్పాటుచేసేందుకు నిర్ణయం జరిగింది. ప్రత్యేకహో దా బదులు స్పెషల్‌ప్యాకేజ్ కూడా లభించింది. అయితే అప్పట్లో ప్రతిపక్షంలోని వైసీపీ రెచ్చగొట్టి కూటమి సఖ్యతని దెబ్బతీసింది.

2019-24 మధ్యన గుంటూరు జిల్లాకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు నామమాత్రమే. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులకు మాత్రమే నిధుల కేటాయించారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే అడుగు ముందుకు పడలేదు. రాజధాని నిర్మాణాన్ని నిలిపేసి మూడు ముక్కలాటకు తెరతీయడంతో కేంద్రం కూడా ఎలాంటి నిధులను ఇవ్వలేదు. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గానికి కూడా నిధులు కోరకపోవడంతో దానిని కూడా కేంద్రం అటకెక్కించింది. అయితే ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడటంతో వైసీపీపై తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో నిధుల కేటాయింపులో కచ్చితంగా తగిన ప్రాధాన్యం ఉంటుంద న్న అంచనాలు పెరిగిపోయాయి. ఎర్రుబాలెం-నంబూరు అమరావతి నూతన రైలుమార్గానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉన్నది. అలానే అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు, చినకాకాని-పొట్టిపాడు విజయవాడ ఈస్టర్న్ బైపాసు, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి నిధులు కేటాయించొచ్చని అంచనా వేస్తున్నారు. అలానే గుంటూరు - బీబీనగర్ రైల్వేడబ్లింగ్ కూడా నిధులు కేటాయించే అవకాశం ఉన్నది.

రూ.10.48లక్షల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత


ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు సిటీ, జూలై 22: గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ దాడుల్లో వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా పురుగుమందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. శ్రీపారిజాత ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్‌లో నిల్వ ఉంచిన రెండు రకాల పురుగుమందులు, గుళికల బస్తాలపై ముద్రించిన వివరాలు సరిగా లేనందున అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. రూ.10.48 లక్షల విలువ చేసే 38.195 మెట్రిక్ టన్నుల గుళికల అమ్మకాలు నిలిపివేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి ఖడ్గం రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి గౌతమ్ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127,138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

చోరీ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూలై 22: మోటర్‌సైకిళ్ల చోరీకేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుల నుంచి సుమారు రూ.9లక్షల విలువైన 16 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై నరసరావుపేట, గుంటూరులలో 16 చోరీకేసులు నమోదయ్యాయన్నారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో 11, గుంటూరులో 5 మోటారు సైకిల్‌ను చోరి చేసినట్లు తెలిపారు. నిందితులైన మండలంలోని యలమందకు చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన ఎం.రవి, ఒంగోలుకు చెందిన షేక్ కృపారావులను కోర్టులో ప్రవేశపెడతామన్నారు. వీరు పాత నేరస్తులని, అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎస్ఐ సుమన్, ఏఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులతో సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుమన్, సిబ్బంది

36,561 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,466 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 36,561 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,540 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	8500	14500
నెంబరు. 5	9000	14500	నెంబరు. 5	9000	12000
273	11000	15000	273	–	–
341	9000	15000	341	8500	16500
4884	–	–	4884	–	–
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18500	తేజ	9000	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	10000	11000	దేవనూరుడీలక్స్	10000	12000
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	5700	12000



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యానిమేటర్లు

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

● యానిమేటర్ల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కే పద్మ

గుంటూరు(తూర్పు), జూలై 22: యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని యానిమేటర్ల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కే పద్మ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యానిమేటర్లను ఇష్టానుసారంగా తొలగించడం సరికాదని అన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు కూడా రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేధింపులు, తొలిగింపులపై న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. ధర్నా అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్డీఏ పీడీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం నాయకులు పద్మ, దేబోరా, శారద, విజయలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

విద్యతోనే పద్మశాలీయుల అభ్యున్నతి

● సంఘం అధ్యక్షుడు గుర్రం చిన వీరయ్య



మాట్లాడుతున్న గుర్రం చినవీరయ్య, పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), జూలై 22: విద్యతోనే పద్మశాలీయుల అభ్యున్నతి సాధ్యమవుతుందని నగర పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గుర్రం చిన వీరయ్య తెలిపారు. సోమవారం, స్థానిక గుజ్జనగుండ్ల, ప్రగడ కోటయ్య చేనేత భవన్ సమావేశ మందిరంలో నగర పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో 500మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా దాతల సహకారంతో నగర పద్మశాలి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గోలి ద్రాక్షాయమ్మ ఎడ్యుకేషనల్ చారిట బుల్ ట్రస్ట్ వారిచే ప్రతిభ చూపిన పలు విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి.సూర్యనారాయణ, డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు డాక్టర్ అందే వెంకటేశ్వరరావు, విద్యావేత్త మురుగుడు శ్రీహరి, విశ్రాంత బ్యాంకు ఉన్నతాధికారులు ఆకురాతి అమర్నాథ్, రామనాథం పరమేశ్వరరావు, కారంపూడి వాసుదేవరావు, సంఘం ప్రధాన కార్యదర్శి పడవల రఘురాం పాల్గొన్నారు.

జీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఎస్ఈ శ్యామ్‌సుందర్

గుంటూరు, జూలై 22: నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో ఎస్ఈ శ్యామ్‌సుందర్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ట్రాన్స్‌కో జేఎండీగా నియమితులైన విషయం తెలిసిందే. దాంతో ఆమె కమిషనర్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. కొత్త కమిషనర్‌గా నియమితులైన కొత్తమాసు దినేష్‌కుమార్ బుధవారం, లేదా గురువారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని జీఎంసీ వర్గాలు తెలిపాయి. అప్పటి వరకు ఎస్ఈనే ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

నదీజలాల వినియోగంపై పరిశోధన చేయాలి

● మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గుంటూరు(విద్య), జూలై 22: భవిష్యత్తులో నీటి కొరత వల్ల సంభ వించనున్న పలు ప్రమాదాల నివారణకు, నదీ జలాల సమర్థ వినియోగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల తోడ్పాటుకు ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (తెలంగాణ) టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మిషన్ భగీ రథ - సస్టైనబుల్ డ్రింకింగ్ వాటర్ మేనేజ్మెంట్ అనే అంశంపై ఆర్వీ ఆర్ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నదీజలాల ద్వారా సరఫరా అయ్యే నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వచేసే విధానాన్ని, తాగు, సాగునీరు అందించే దశల్లో జరిగే వివిధ పద్ధతులను, తెలంగాణా రాష్ట్రంలో చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణలో జరిగే వివిధ ప్రక్రియ లను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, జగదీష్ కె.మద్దినేని, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి

గుంటూరు (మెడికల్) జూలై 22: వర్షాకాలంలో దోమకాటు వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి, మలేరియా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆమె సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో మురుగునీరు పరిసర ప్రాంతాల్లో నిలిచి దోమల లార్వాలు పెరిగేందుకు అనువైన వాతావరణం ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పరిసరాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. సమావేశంలో డీఎంవో సుబ్బరాయణం, ఏఎంవో రాజునాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు సంఘసాలశ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్, శ్రీమన్నారాయణ, శేషగిరి రాజు, వెంకటప్పయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

● జిల్లా కార్యదర్శి ఎం కిరణ్

గుంటూరు(విద్య), జూలై 22: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుంటూరు జిల్లా ప్లీనరీ ఈనెల 26 27 తేదీల్లో గుంటూరు నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఈ మేరకు సోమవారం సమావేశాల పోస్టర్స్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎంకిరణ్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేసేందుకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకు నేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని అన్నారు. జీవో నెంబర్ 77ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, ఉపాధ్యక్షురాలు సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ముగ్గురిలో ఒకరికి నరాల సంబంధిత జబ్బులు

● న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ వెల్లడి



గుంటూరు (మెడికల్) జూలై 22: ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి ముగ్గురిలో ఒకరికి వారి జీవిత కాలంలో నరాల సంబంధిత జబ్బులు సంభవించే అవకాశం ఉందని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. మెదడు జబ్బులపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఏటా జూలై 22న వరల్డ్ బ్రెయిన్‌డేగా పాటిస్తున్న సందర్భంగా సోమవారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. మెదడు ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా బ్రెయిన్ డే నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పక్షవాతం, మైగ్రేన్, డిమెన్షియా, మెనింజైటిస్, మూర్ఛలు, పార్కిన్సన్ వ్యాధి, నియోనేటల్ ఎన్‌సెఫలైటిస్, డయాబెటిక్ న్యూరోపతి, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, నాడీ వ్యవస్థ కేన్సర్లు మన దేశంలో కనిపించే సాధారణ నాడీ సంబంధ వ్యాధులని ఆమె తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తే వీటిలో చాలవరకు నివారించవచ్చన్నారు. చదరంగం, పజిల్స్, సుడోకు వంటి బ్రెయిన్ గేములు ఆడటం వల్ల మెదడును ఆరోగ్యంగా ఉంచి నరాల జబ్బులకు దూరంగా ఉండొచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ వెల్లడించారు.

ఎన్జీవో కాలనీలో మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

గుంటూరు, జూలై 22: స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ 12వ లైన్ శివారు నల్లకుంటకు చెందిన రేపూడి సుమ (20) అనే మతిస్థిమితం సరిగా లేని యువతి అదృశ్యమైంది. తల్లి అనిత ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసినవారు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సీఐ వంశీధర్‌కు 8688831376లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

నిర్ణీత గడువులోపు ఫిర్యాదులు పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 215 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో పెద్ది రోజా తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఉన్నాతాధికారులకు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి 215 అర్జీలు అందాయి. డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో పి.శ్రీకర్, డ్వామా, డీఆర్డీఏ పీడీలు ఉమాదేవి, హరిహరనాథ్‌తో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారులు వద్దకి నేరుగా వెళ్లి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఫిర్యాదులు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదులు పరిష్కరిస్తూ చేసిన ఎండార్స్‌మెంట్‌ను తదుపరి సమావేశంలో పరిశీలిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరా వు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, డీఈవో శైలజ, డీ సీవో వీరాచారి, జిల్లా ఉపాధి అధికారి రఘు, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు

● గుంటూరు, రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఉన్న ఎర్ర వాగులో పూడిక తీయాలని ఆ ప్రాంత రైతుల సంతకాలతో కూడిన అర్జీని రాష్ట్ర రైతు సంఘం, జిల్లా కమిటీ నాయకులు ఇమ్మడి రామారావు కలెక్టర్‌కు అందజేశారు. వర్షకాలంలో పూడిక తీయకపోవడంతో కాలువ సమీపంలోని 200ఎకరాల్లో పంట నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

● మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వట్టిచెరుకూరు మండలం, కొర్నెపాడు వద్ద ఉన్న జగనన్న కాలనీ లబ్ధిదారులు అర్జీ అందజేశారు. రెండేళ్ల క్రితం దాదాపు 60 మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నామని, కానీ రోడ్లు, కరెంటు, ఇతర సౌకర్యాలు గత ప్రభుత్వం కల్పించలేదని వాపోయారు. దీనిపై పంచాయతీలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో హసీనా, శంకుతల, భారతీ తదితరులున్నారు.

● జిల్లాలోని అనేక గ్రామాలకు తాగునీరు. సాగునీరు అందించే గుంటూరు హైలెవెల్ చానల్ మరమ్మతులను తక్షణమే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మంగళగిరి, పొన్నూరు. ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు, గుంటూరు అర్బన్ పరిధిలో 30 గ్రామాలకు తాగునీరు అందించే ప్రాజెక్టను నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. తక్షణమే గుర్రపుడెక్క తొలగించాలని, శాశ్వత ప్రాతిపదికన కాలువను అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతుసంఘ నాయకులు రంగారెడ్డి, మాల్యాద్రి తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత, కలుషిత నీటి కారక, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ సీజనల్ వ్యాధులు, మధ్యాహ్న భోజన పథకం, సీసీఆర్సీ కార్డుల మంజూరు, సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం, భారీ వర్షాలు తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

50 లక్షల మొక్కలు నాటేందుకు మెగా ప్లాంటేషన్

జిల్లాలో పచ్చదనాన్ని పెంచి వాతావరణ సమతౌల్యం సాధించేందుకు 50లక్షల మొక్కలతో మెగా ప్లాంటేషన్ చేపట్టేందుకు లైన్ డిపార్టుమెంట్ అధికారులు సమన్వయంతో కార్యాచరణ పథకాన్ని వారం రోజుల లోపు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లాలో పచ్చదనాన్ని పెంచే క్రమంలో మెగా ప్లాంటేషన్ చేపట్టేందుకు నోడల్ అధికారులుగా నియమించిన డ్వామా, డీఆర్డీఏ, ఉద్యాన, సాంఘిక సంక్షేమం, అటవీ శాఖ అధికారులు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఆయా కార్యక్రమాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, సీపీవో శేషశ్రీ, డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మీ, డీఈవో శైలజ, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యనశాఖ అధికారి రవీందర్, డ్వామా పీడీ ఉమాదేవి, బీసీ కార్పోరేషన్ ఈడీ దుర్గాబాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, గిరిజన సంక్షేమశాఖ అధికారి శిరీష, నగర పాలక సంస్థ ఎస్ఈ శ్యాంసుందర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గిరి.. గిరగిరా...

● అధికారం ఎటుంటే అటే చూపు....

● ఇప్పటికే ద్వారాలు మూసేసిన తెలుగుదేశం...

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి సోమవారం వైసీపీ పార్టీకి, నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ మాజీ సీఎం జగన్‌కు లేఖ పంపాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి దూకేందుకు సిద్ధమవుతున్నాడు. వైసీపీ పరాజయంపాలై రెండు నెలలు కూడా గడవక ముందే టీడీపీలోకి రావాలని ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అతను చేసిన నమ్మక ద్రోహాన్ని గుర్తుపెట్టుకొని పార్టీ అధిష్ఠానంతో పాటు స్థానిక నేతలు కూడా 'నో ఎంట్రీ' బోర్డు పెట్టేశారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన మద్దాళి గిరిని 2014 ఎన్నికల్లో టీడీపీ నేతలు ఏరికోరి రాజకీయాల్లోకి తీసుకొచ్చి గుంటూరు తూర్పు నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. ఆ ఎన్నికల్లో గిరి ఓటమి పాలైనా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. తిరిగి 2019 ఎన్నికల నాటికి తూర్పు నియోజకవర్గాన్ని ఆనవాయితీ ప్రకారం ముస్లింలకే కేటాయించాలని భావించి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న గిరికి తగిన న్యాయం చేసేందుకు పశ్చిమ సీటును ఇచ్చారు. అప్పటికప్పుడు వలస వచ్చిన గిరికి నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు అండగా నిలిచి అసంతృప్తులను పక్కన పెట్టి గెలుపే ధ్యేయంగా పనిచేసి గెలిపించుకున్నారు. కాగా ప్రభుత్వం అధికారంలోకి రాకపోవటంతో టీడీపీ తరపున గెలుపొందిన గిరి నెలల వ్యవధిలోనే ఆనాటి సీఎం జగన్‌సమక్షంలో వైసీపీ పంచన చేరాడు. అక్కడ కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేగా అందిన కాడికి అందినంత దోచుకొని అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. చివరకు 2024 ఎన్నికల నాటికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా గిరి ఉండగానే రజినీని పశ్చిమ అభ్యర్థిగా వైసీపీ రంగంలోకి దించింది. అయితే ఆ చర్యపై ఆర్యవైశ్య సామాజికవర్గం నుంచి నిరసనలు వచ్చినప్పటికీ గిరి మాత్రం అవేవి పట్టించుకోకుండా రజినీకి వత్తాసు పలికారు. అయితే ఇందుకు గాను ఆయనకు మంత్రి హోదాలో ఉన్న రజినీ భారీగా నజరానాను ముట్టచెప్పినట్లు వైసీపీ వర్గాల్లోనే ప్రచారం జరిగింది. అయితే వైసీపీలో ఇంకా కొనసాగితే తన వ్యాపారాలకు ముప్పు అని భావించి ముందు ఆ పార్టీ నుంచి బయటకు వచ్చే నిర్ణయం తీసుకున్నారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన ప్రైమ్ హాస్పిటల్స్



బాలిక వైష్ణవితో వైద్యనిపుణుల బృందం

గుంటూరు (మెడికల్) జూలై 22: అత్యవసర చికిత్సలతో ఇద్దరి ప్రాణాలు కాపాడినట్లు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ వైద్యనిపుణులు ప్రకటించారు. సోమవారం నాజ్‌సెంటర్‌లోని ప్రైమ్ ఆసుపత్రిలో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ పేరం కుప్పుస్వామి మాట్లాడుతూ రుమాటిక్ హార్ట్ డిసీజ్‌తో బాధపడుతున్న గంగా జలం (56) అనే మహిళకు హృదయంలో మైట్రల్ వాల్వ్ అనే కవాటం మూసుకుపోయి రక్త ప్రసరణకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు తెలిపారు. ఆమెకు మైట్రల్‌వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేసి కొత్త కవాటం అమర్చినట్లు తెలిపారు. దీని వల్ల రోగి సాధారణ జీవితం గడిపే అవకాశం ఏర్పడిందన్నారు. తమ ఆసుపత్రిలో బీటింగ్ హార్ట్ సర్జరీతో పాటు అన్ని రకాల ఆధునిక గుండె జబ్బుల చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ కుప్పుస్వామి తెలిపారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ సాయిరాజశేఖర్ కాసుల మాట్లాడుతూ ఆయాసం, దగ్గు, జ్వరం, రక్తపు వాంతులు వంటి లక్షణాలతో అత్యవసర పరిస్థితిలో ఉన్న వైష్ణవి అనే 11 ఏళ్ల బాలిక ప్రాణాలు సంరక్షించినట్లు తెలిపారు. సీటీ స్కాన్‌లో ఊపిరితిత్తుల్లో రక్తం చేరినట్లు గుర్తించి వెంటనే బ్రాంకైల్ ఆర్టరీ ఎంబలైజేషన్ ప్రక్రియతో రక్తనాళం సరి చేసినట్లు తెలిపారు. దీంతో బాలిక ఆరోగ్యపరంగా కోలుకున్నట్లు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. హాస్పిటల్ సీఈవో పార్థసారథి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటు 24 గంటలూ అత్యవసర వైద్యసేవలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ తేజస్విని జల్లేపల్లి, న్యూరో సర్జన్ డాక్టర్ పవన్‌కుమార్ బడుగు, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ కృష్ణతేజ, జనరల్ ఫిజీషియర్ డాక్టర్ అచ్చంశెట్టి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించి ఇస్తానని డబ్బులు తీసుకొని మోసం

● ఎస్పీ కార్యాలయంలో పలువురు బాధితుల ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, జూలై 22 : తమ సంస్థ ద్వారా చేబ్రోలులో రెండు సెంట్లు స్థలంలో ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పి తమ నుంచి అడ్వాన్స్‌గా లక్ష అరవై వేలు చొప్పున డబ్బులు తీసుకుని మోసం చేసాడని బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చేబ్రోలుకు చెందిన గట్టుపల్లి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి రీచ్ ఆర్గనైజేషన్ అనే సంస్థ ద్వారా ఇల్లు నిర్మిస్తానని చెప్పాడన్నారు. దీంతో తాము నిజమేనని నమ్మి ఒక్కొక్కరు అడ్వాన్సుగా లక్ష 60వేలు చెల్లించామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇల్లు నిర్మించక పోవడంతో తాను గట్టిగా అడగడంతో తమ నలుగురి నుంచి తీసుకున్న మొత్తానికి ఆరు లక్షల నలభై వేల చెక్కును 2022లో తమకు ఇచ్చాడు అన్నారు. అయితే చెక్కును బ్యాంకులో ప్రజెంట్ చేయకుండా డబ్బులు ఇస్తానంటూ అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. చెక్కుపై వేసిన తేదీ ముగుస్తున్న తరుణంలో తాము బ్యాంకులో వేస్తామని చెప్పగా తన అనుచరులను బ్యాంకు వద్ద పెట్టి తమను బెదిరింపులకు గురిచేశాడు అన్నారు. ఆ తర్వాత తమ ఫోన్లు తీయడం లేదని, ప్రస్తుతం వారు ఎక్కడున్నారో కూడా తెలియడం లేదని బాధితులు వాపోయారు. మోసం చేసిన సుబ్రహ్మణ్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఎస్పీని కలిసిన వారిలో నగరంలోని శశాంక్ గోయల్ కాలనీకి చెందిన కల్లూరి విజయదుర్గ, మాదాబత్తుల సూరి అప్పారావు, కృష్ణబాబు కాలనీ పరిధిలోని లాల్‌పురం డొంకకు చెందిన చిట్టేల శివరామకృష్ణ, నల్ల చెరువు 9/1కి చెందిన కందుల సాయికుమార్ తదితరులున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని లక్ష తీసుకొని మోసం

తనకు బిజినెస్ అనలిస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి రూ.లక్ష తీసుకొని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు మోసం చేశాడని బ్రాడీపేటకు చెందిన ఖాజా వెంకట సాయి మణి ప్రదీప్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బ్రాడీపేటకు చెందిన గ్రైడ్ సాఫ్ట్ అనే కన్సల్టెన్సీ నిర్వాహకుడు తన నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

తన కుమారుడికి కొత్తగా ఏర్పాటు అయిన పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నారయ్య అనే వ్యక్తి తన నుంచి రూ2లక్షల 60 వేలు తీసుకొని మోసం చేశాడని పాత గుంటూరులోని బాలాజీ నగర్ నాలుగో లైన్‌కి చెందిన పెదాల బాబు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు స్నేహితులైన తెనాలికి చెందిన విజయబాబు, ఆయన భార్య సునీతలు చెప్పిన మేరకు తాను నారయ్య అనే వ్యక్తిని సంప్రదించానన్నారు. డబ్బులు తీసుకొని సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తాను పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి విచారించగా నారయ్య ఎక్కడ ఉద్యోగం చేయడం లేదని ఇలాగే అనేక మందికి చెప్పి ఉద్యోగాన్ని ఇస్తానని డబ్బులు తీసుకున్నట్లు వారు తెలిపారు. ఉద్యోగం పేరుతో తన నుంచి డబ్బులు తీసుకొని మోసం చేసిన నారయ్యపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తన డబ్బు తనకు రికవరీ చేయాల్సిందిగా బాధితుడు బాబు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

లారీ యజమానిపై చర్యలు తీసుకోవాలి

తాను ఏటుకూరుకు చెందిన లారీ యజమాని శివకుమార్ వద్ద క్లీనర్‌గా పనిచేస్తూ అడ్వాన్సుగా కొంత డబ్బు తీసుకొని మూడు రోజుల పాటు డ్యూటీకి వెళ్లలేదని అమరావతి మండలానికి చెందిన కడియాల నాగేశ్వరరావు అనే వ్యక్తి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తాను సక్రమంగా డ్యూటీకి వెళ్లలేదనే కారణంతో లారీ యజమాని శివకుమార్ తనపై దాడి చేసి కొట్టాడు అన్నారు. ఈ ఘటనలో తన తలకు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్‌లో చేరగా పరిస్థితి విషమంగా ఉందన్నారు. దీంతో వైద్యులు ఆపరేషన్ చేశారన్నారు. ఎట్టకేలకు తాను కోలుకున్నానని, దీనిపై లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపారు. అయితే కేసును డీఎస్పీకి అప్పగించారన్నారు ఈ ఘటన జరిగి నెలన్నర గడచినా ఇంతవరకు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు. ఆకారణంగా తనపై దాడి చేసి హత్యాయత్నం చేసిన లారీ యజమాని శివకుమార్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితులు ఎస్పీ కార్యాలయం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



డ్రెయిన్లు, సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గల్లా మాధవి

సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నవభారత్ నగర్ నాలుగో లైన్, వికాస్‌నగర్ ఒకటో లైన్లలో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులు ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవా రం ప్రారంభించారు. నవభారత్‌నగర్ ఒకటో లైన్ రెండో అడ్డరోడ్డులో రూ.22 లక్షల అంచనాలతో చేపట్టిన సీసీ రోడ్లుకు కార్పొరేటర్ వేము లపల్లి శ్రీరాంప్రసాద్ (బుజ్జి)తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నవభారత్‌నగర్‌లో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని, నియోజకవర్గం మొత్తం ఇదే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. నవభారత్ నగర్‌లో కూడా మంచినీటి సమస్య ఉండడం చూస్తుంటే గత ప్రభుత్వం మరిచినట్లు ఉందని విమర్శించారు. వారం రోజుల్లో అధికారులు మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు డ్రైన్లు బాగు చేయటానికి అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాస రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాస్, బోసు, తిలక్, పున్నయ్య చౌదరి, బంగారు బాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎగొట్టడానికే దిక్కుమాలిన ధర్నాలు

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి వెళ్లకుండా ఎగవేయడానికే జగన్‌రెడ్డి దిక్కుమాలిన ధర్నాలు చేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంసకర, భయానక పరిపాలన చూసిన జనం ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టడంతో రాజకీయ అరణ్యవాసంలో చిక్కుకొని దిక్కుతోచని స్థితిలో అబద్దాలు, ధర్నాలతో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలి, ప్రభుత్వాన్ని రద్దు చేయాలంటూ' ఢిల్లీలో ధర్నాలు చేస్తానని జగన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని, అసెంబ్లీ సమావేశాలు ఎగొట్టడానికే నాటకాలకు తెర తీశా రని మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు కూడా గడవక ముందే రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీలో జగన్ ధర్నాలు చేస్తానని ప్రకటించడం చూస్తుం టే అసలు ఆయన మనిషేనా అనే అనుమానం కలగకమానదన్నారు. జగన్ ఎన్ని ధర్నాలు చేసినా, తలకిందులుగా తపస్సు చేసినా మరోసారి నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్న విషయం తెలుసుకోవాలని మోహనకృష్ణ హితవు పలికారు.



సమావేశం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

శవ రాజకీయాలకు తెర లేపిన జగన్

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): శవాల పునాదులపై ఏర్పడిన పార్టీ వైసీపీ అని, అందుకు అనుగుణంగానే వినుకొండ ఘటనను పార్టీకి పులిమి శవ రాజకీయాలకు జగన్ తెరలేపారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనలో అనేకమందిని వైసీపీ నాయకులు నడిరోడ్డుమీద హత్య చేస్తే ముఖ్యమంత్రిగా ఆయన ఏ రోజూ స్పందించలేదన్నారు. శవ రాజకీయాలు చేయటం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్యని, దెయ్యాలు వేదాలు వల్లించినట్టు జగన్ మాటలు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఎప్పుడూ ధర్నా చేయని జగన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేయడానికి పూనుకోవటం సిగ్గుచేటని అన్నారు. తప్పుడు రాతలతో, తప్పుడు మాటలతో ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న జగన్‌ను ఎవరు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి మతి తప్పి మాట్లాడటం అతని విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. చంద్రబాబు నెల రోజుల పాలనతోనే ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సమావేశంలో మేశం సైదయ్య, షేక్ చిన్న బాజీ, కే.యం. ఇ హస్సేన్, కంచర్ల సాంబశివరావు, మొవ్వా వేణు బాబు, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ ప్రారంభం



టీఎల్ఎం మెటీరియల్ పరిశీలిస్తున్న ఎండీ ఖాసిం తదితరులు

గుంటూరు(విద్య), జూలై 22: శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను సద్వి నియోగించుకోవాలని, ఉపాధ్యాయులు బోధన అభ్యసన సామగ్రిని స్వయంగా తయారు చేసి ప్రదర్శించాలని ఉర్దూ డీఐ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసిం సూచించారు. సోమవారం చౌత్రాసెంటర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఖాసిం మాట్లాడుతూ స్థానికంగా దొరికే లో కాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రి ఎంతో ఆకర్షణగా ఉందన్నారు. విద్యార్థులందరూ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బోధన అభ్యసన సామగ్రిని తయారు చేయవలసిందిగా సూచించారు. ప్రభుత్వం వారు చేపట్టిన శిక్షా సప్తాహ కార్యక్రమంలోని రోజువారీ కార్యక్రమాలను వారం పాటు నిర్వహించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం తగదు

● యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం కళాధర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి, కళాధర్ తదితరులు

గుంటూరు(విద్య), జూలై 22: శిక్షణ పేరుతో ఉపాధ్యాయుల్ని బోధనకు దూరం చేయడం తగదని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం కళాధర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పిల్లలు ప్రవేటు బాట పడుతున్న తరుణంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి ఉపాధ్యాయుల్ని బోధనకు దూరం చేయడం తగదని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ స్పాట్ వాల్యూయేషన్, స్వచ్ఛ ఇండియా పేరుతో శిక్షణ వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరమౌతున్నారని పేర్కొన్నారు. టీచింగ్ టూల్ ట్రైనింగ్, ఇంగ్లిష్ లిటరసీ పేరుతో శిక్షణ చేపడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులకు బోధన చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. శిక్షణ వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరమౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి

ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జి స్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.



రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విధానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని అర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా ప్లస్ వన్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్ఎస్ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్ధమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండ కూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి

వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాథలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదు సంవత్సరాల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లున్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

అమ్మకాల వెల్లువ

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్ మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది.



ఆహార ధరలపై వాతావరణ ప్రభావం

గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడి గాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.

ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

తహసీల్దార్ కార్యాలయానికి ఆరు అర్జీలు

తెనాలి రూరల్, జూలై 22: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాటిలో పట్టాదారు పాసుపుస్తకానికి 3, సర్వేకు 2, ఇరత సమస్యలతో 1 అందినట్లు పేర్కొన్నారు. తన కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని తహసీల్దార్ స్పష్టం చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు 10 దరఖాస్తులు

తెనాలి అర్బన్, జూలై 22: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 2, మున్సిపాలిటీ 3, హౌసింగ్ 2, డీఎల్‌పీవో, సివిల్ సప్లై శాఖలకు మూడు దరఖాస్తులు అందగా వాటిని సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

పురపాలక సంఘానికి ఐదు అర్జీలు

తెనాలి, మారీసుపేట జూలై 22: పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. అందులో స్థలం సర్వే కోసం, ప్రభుత్వ స్థల ఆక్రమణల గురించి రెండు, విశ్వకర్మ యువజన సంక్షేమ పథకం గురించి, ఇంటి పక్కన పావురాల పెంపకం గురించి అర్జీలు మొత్తం ఐదు వచ్చాయని తెలిపారు.



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని అందిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ప్రకాష్, వీరవల్లి మురళి, నాగభూషణం, నారాయణప్రసాద్ తదితరులు

చిరస్మరణీయుడు రావినూతల

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

తెనాలి, మారీసుపేట జూలై 22: విద్యావేత్త రావినూతల సత్యనారాయణ చిరస్మరణీయుడని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. మండల పరిధిలోని అంగలకుదురులో సోమవారం జిల్లా పరిషత్ పాఠశాలలో రావినూతల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలను రావినూతల ఫౌండేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు శాఖమూరి నారాయణప్రసాద్ అధ్యక్షతన, ముఖ్యఅతిథిగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రావినూతల ఫౌండేషన్‌వారు ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం, వివిధ రంగాలలో విశేష సేవలను అందిస్తున్న వారిని సత్కరించడం అభినందనీయం అన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రతిభ చూపిన 25మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలను అందించిన సాయి లక్ష్మరాజు, గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, ఐనాల మల్లేశ్వరావు, గుంటూరు శ్రీనివాస్‌లను దుశ్శాలువాలతో సత్కరించి మెమొంటోలను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులు లక్ష్మీఅన్నపూర్ణ, అల్లం నారాయణ, మహాలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. అనతరం రావినూతల ఫౌండేషన్ లోగోను హెనీ క్రిస్టీనా అవిష్కరించారు. పలువురు అతిధిలు రావినూతల సత్యనారాయణ పేద విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాన్ని ఫౌండేషన్ సభ్యుడు ఆర్ ప్రకాష్ ఆధ్వర్యంలో శివప్రసాద్, రాజేష్, ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, గరికపాటి సుబ్బారావు, అబ్బరాజు తిమ్మరుసు, రావినూతల కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

తెనాలి, మారీసుపేట జూలై 22: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. మండల పరిధిలోని అంగలకుదురులో జడ్పీహెచ్ స్కూల్‌లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. మండల పరిధిలోని పలు గ్రామాలలోని పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, వెంకటనారాయణ, మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవితేజ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



రవితేజ తల్లిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలి అర్బన్, జూలై 22: అమెరికాలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన తాడిబోయిన రవితేజ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ గుర్రం ద్వారకాశీను చెప్పారు. ఐతానగర్‌లో నివాసం ఉంటున్న ఆయన తల్లిని సోమవారం కలిసి ధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితిని రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తామన్నారు.



మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

పాస్టర్ల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా అండ

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జూలై 22: సమాజ శాంతికోసం పాటుబడే పాస్టర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ వారి అభ్యున్నతికి సహాయ సహకారాలు అందిస్తుందని తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజవర్గ ఇన్‌ఛార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పలు ప్రార్థనా మందిరాల పాస్టర్లు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి గెలుపుకు కృషిచేసిన పాస్టర్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా అనేక విధాలుగా ప్రభుత్వపరంగా అండగా నిలిచి వారి అభ్యున్నతికి కృషిచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో వారి అభ్యున్నతిని గాలికొదిలేసి వారికి అనుకూలంగా ఉన్నవారికి కేవలం గౌరవవేతనం అంటూ అందించి చర్చిల అభివృద్ధిని కుంటుపరిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పాస్టర్లకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. తొలుత మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బ్రదర్ సాల్మన్, యబ్బేజు, జక్రయ్య, మల్లవరపు విజయ్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు అన్నంఆదాము, ప్రవర్ధన్ వర్మ, బబురావు, షద్రక్, షాలెము, శుభాకర్, గాబ్రియేలు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో 10 మందికి బంగారు పతకాలు

తెనాలి అర్బన్, జూలై 22: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన 10మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 21న రేపల్లె సమీపంలోని పల్లెకోనలో నిర్వహించిన పోటీలలో హరిహంసిక తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు 10మంది బంగారు పతకాలు సాధించగా ఆరుగురు వెండి పతకాలు, ఏడుగురు కాంస్య పతకాలు సాధించారని కోచ్ కిరణ్‌రెడ్డి, మాస్టర్ సత్యనారాయణ చెప్పారు. టోర్నమెంట్‌లో అత్యధిక పతకాలు సాధించి 2వ స్థానంలో నిలిచినందుకుగాను రూ.10వేలు నగదు బహుమతి కూడా అందుకున్నామని, పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

బోగస్ గ్రూపులు, అక్రమ రుణాలపై విచారణ



మెప్మా కార్యాలయంలో విచారణ అధికారుల ముందు వాగ్వివాదం చేస్తున్న సిబ్బంది

పొన్నూరు టౌన్, జూలై 22: అవినీతిమయంగా మారిన పొన్నూరు మెప్మా విభాగం బోగస్ గ్రూపులు, అక్రమ రుణాలపై ఎట్టకేలకు విచారణ ప్రారంభమైంది. పొన్నూరు మెప్మా విభాగంలో బోగస్ గ్రూపులు సృష్టించి పెద్దఎత్తున రుణాలు పొందారని జూలై 12వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం వెల్లువడింది. దీనిపై బాధిత మహిళలు మెప్మా అధికారులను నిలదీయటంతోపాటు మెప్మా పీడీ వెంకటేశ్వరరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందచేశారు. కొందరు వైసీపీ మాజీ కౌన్సిలర్లతో మెప్మా స్థానిక సిబ్బంది కుమ్మక్కై ఈ బోగస్ గ్రూపులను సృష్టించి అక్రమ మార్గంలో రుణాలు పొందారని ఫిర్యాదులు అందాయి. పట్టణంలోని నిడుబ్రోలు 8వ వార్డులో సుమారు 15 బోగస్ సంఘాలు ఏర్పాటు చేయటమే కాకుండా ఈ సంఘాలు కోటికి పైగా రుణాలు పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ బోగస్ గ్రూపులపై స్పందించిన పీడీ వెంకటేశ్వరరావు, పీడీ కార్యాలయ అధికారులు కీర్తి, రాజశేఖర్లను సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. సోమవారం పొన్నూరు మెప్మా కార్యాలయానికి విచ్చేసి అధికారులు విచారణ చేపట్టారు. ప్రధానంగా తార పొదుపు సంఘం, మదర్ థెరిస్సా గ్రూప్, శాంతి, దుర్గమ్మ, వైఎస్సార్ పొదుపు సంఘాలకు సంబంధించిన లింకేజ్ రుణాలపై విచారణ ప్రారంభించారు. పట్టణంలోని చైతన్య గోదావరి బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను తనిఖీచేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సీఎంఎం మేరి జోత్స్న, రిసోర్స్‌పర్సన్ సంధ్యతో పాటు సీవోలను పిలిపించి విచారణ చేపట్టారు. అయితే అదే సమయంలో వైసీపీకి చెందిన మాజీ కౌన్సిలర్లు మూకిరి అనీల్ కుమారి విచారణ అధికారుల వద్దకు వచ్చి రిసోర్స్‌పర్సన్ సంధ్యతో వాగ్వివాదానికి దిగారు. రుణాలు తమకే ఇచ్చామని సంధ్య చెప్పటంపై అభ్యంతరం వ్యక్తం చేసి, వాగ్వివాదానికి దిగటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సంబంధంలేని వ్యక్తి విచారణ అధికారుల వద్దకు వచ్చి వాగ్వివాదానికి దిగి, దుర్భాషలాటంపై మున్సిపల్



బ్యాంక్‌లో వివరాలు సేకరిస్తున్న విచారణ అధికారులు

సిబ్బంది, విచారణ అధికారుల వద్దకు వచ్చిన బాధిత మహిళలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రిసోర్స్‌పర్సన్ సంధ్య విచారణ అధికారుల ముందు తన ద్వారా మంజూరైన రుణాల నగదు సీఎంఎం ద్వారా వైసీపీ నాయకురాలు అనీలా కుమారికి ఇచ్చానని ఆరోపణలు చేశారు. వాగ్వివాదం కొనసాగటంతో విచారణ అధికారులు గ్రూప్ సభ్యులను మంగళవారం విచారణకు పిలవాలని ఆదేశించి వెళ్లిపోయారు. పొన్నూరులో తమ విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను పీడీ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ జరిపేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. అయితే వాగ్వివాదం జరిగే సమయంలో మెప్మా అధికారులు ఒకరిపై ఒకరు ముడుపులు చెల్లించుకున్న వివరాలను బహిర్గతం చేయటంతో విచారణ అధికారులు అవాక్కయ్యారు. అంతేకాకుండా నగదు చెల్లింపు సంబంధించి ఫోన్‌పేలు, గూగుల్‌పేల ద్వారా చెల్లించామని తీవ్ర ఆరోపణలు గుప్పించటంతో విచారణ అధికారులు వాటి వివరాలని సమర్పించాలని రిసోర్స్ పర్సన్స్‌ను ఆదేశించారు. ఒక్కో బోగస్ సంఘానికి అనుమతించినందుకు లక్ష వరకు ముడుపులు చెల్లించామని రిసోర్స్‌పర్సన్స్ వెల్లడించటం సర్వత్రా చర్చనీయాంసమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని మెప్మా విభాగాన్ని తీవ్ర అవినీతిమయంగా మార్చారని ఆరోపణలు వెల్లవెత్తున్నాయి. విచారణ అధికారుల ముందే ముడుపులకు సంబంధించిన విషయాలను వెల్లడించటంతో విచారణ అధికారులు తెల్లబోతున్నారు.

ఏది ఏమైనప్పటికి గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు మెప్మా విభాగం ప్రతినిధులు కుమ్మక్కై బోగస్ గ్రూపులు సృష్టించి అక్రమ మార్గంలో రుణాలు పొందారని విచారణతో బహిర్గతం అవుతోంది. లోతైన విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగు చూస్తాయని పట్టణ పొదుపు మహిళలు మెప్మా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

● మామిళ్లపల్లిలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

● రూ. 5.20 కోట్ల వ్యయంతో 6.7 కిలోమీటర్ల రహదారి



మామిళ్లపల్లిలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ తదితరులు

పొన్నూరు టౌన్, జూలై 22: కొండంత అభిమానంతో అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో ఆదివారం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా 6.7 కిలో మీటర్ల మేర నిర్మించనున్న రూ.5.20 కోట్ల వ్యయ రహదారిని కేంద్ర మంత్రి పెమ్మసాని, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు శంకుస్థాపన్ చేశారు. ఈ సందర్భంగా కట్టెంపూడి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో కేంద్రమంత్రి పెమ్మసాని మాట్లాడుతూ తన రాజకీయ ఆరంభం ఆత్మీయ సమావేశం పొన్నూరులోనే ప్రారంభమైందన్నారు. అలాగే తన అభివృద్ధి పనుల తొలి శంకుస్థాపన కూడా పొన్నూరులో ప్రారంభం కావటం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధి చేయలేమని మాట్లాడిన నోళ్లకు మొదటి నెలలోనే పెన్షన్ల పంపిణీ, అభివృద్ధి పనుల శంకుస్థాపనతో సమాధానం చెప్పామన్నారు. కేంద్రమంత్రిగా ఐదు రోజులు ఢిల్లీలో, రెండు రోజులు నియోజకవర్గంలో సమయం కేటాయిస్తానని చెప్పారు. అత్యధిక శాతం మంది ప్రజలకు మౌలిక వసతులైన రహదారులు, డ్రెయినేజీ వంటి గృహ నిర్మాణం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. 2014-19 సంవత్సరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని రాష్ట్రంలో 25వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను నిర్మించారని, కానీ వైసీపీ హయాంలో ఆ పథకాన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పవన్ కల్యాణ్ లాంటి బలమైన నాయకుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేయటం వల్ల రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. పొన్నూరులో ఎమ్మెల్యేగా సమాజంపై ప్రేమ ఉన్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఉండటం వల్లనే పొన్నూరు అభివృద్ధికి సువర్ణ అవకాశం లభించిందన్నారు.

ఐదేళ్లు వైసీపీ పాదాల కింద నలిగిన రాష్ట్రం: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

గత ఐదేళ్లుగా రాష్ట్రం వైసీపీ అరాచక నాయకుల పాదాల కింద నలిగిపోయిందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రాంత ఎంపీ కేంద్రమంత్రి కావటం హర్షణీయం అన్నారు. 2019లో అధికారం కోల్పోయిన తర్వాత రాష్ట్రంలో, పొన్నూరులో నిలువుదోపిడీ జరిగిందని ఆరోపించారు. తనపై పోటీచేసిన వైసీపీ అభ్యర్థి సొంత గ్రామం మామిళ్లపల్లి అన్నారు. ఆ గ్రామంలో తనకు మెజార్టీ రాకపోయినా కేవలం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే మామిళ్లపల్లి గ్రామాన్ని ఎంచుకుని అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మామిళ్లపల్లి నుంచి దండమూడి, కట్టెంపూడి ప్రధాన రహదారి వరకు ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. గాంధీజీ నడయాడిన గాంధీమార్గ్‌ను అభివృద్ధి చేసే అవకాశం తొలి ప్రాధాన్యంగా చేపట్టామన్నారు. వైసీపీ పాలకులు ఐదేళ్ళ అధికారం అడ్డం పెటుకుని ప్రజలపై అడగోలుగా దౌర్జన్యం సాగించారని ఆరోపించారు. జగన్ వల్లనే రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయన్నారు. కట్టుకథలు అల్లి రాష్ట్రంలో ఏదో జరుగుతుందని ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సంక్షేమం కోసమే కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని బీజేపీ నాయకులు, పట్టణాభివృద్ధి కమిటీ నాయకులు వినతి పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ ప్రకార్ జైన్, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిష్టీనా, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, డేగల ప్రభాకర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర, జనసేన ఇన్‌చార్జి వడ్రాణం మార్కండేయబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులను త్వరగా పూర్తిచేయాలి

● అధికారులకు సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశం

● సాగు, మురుగు కాల్వల పరిశీలన



కాలువల పూడికతీత పనులపై అధికారులకు ఆదేశాలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి రూరల్, తెనాలి అర్బన్, జూలై 22: డ్రెయిన్లు, ఇరిగేషన్ కెనాల్స్‌లో తూటికాడ, గుర్రపుడెక్క, పూడికతీత పనులను త్వరగా పూర్తిచేయాలని సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరుస వర్షాల కారణంగా డెల్టా పరిధిలోని సాగు, మురుగు కాల్వల పరిస్థితిని సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. చినరావూరు, పెదరావూరు, బుర్రిపాలెం గ్రామాల్లో ఉన్న డ్రెయిన్లు, ఇరిగేషన్ కెనాల్స్ పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని, కాల్వల పరిస్థితి బాగుంటేనే రైతులకు సకాలంలో నీరు అందడం, ఎక్కువైన నీరు డ్రెయిన్ల నుంచి బయటకు వెళ్లడం జరుగుతుందని తద్వారా పంట దిగుబడి పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. పంట కాలువల పూడికతీత పనులు డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. రైతుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు విత్తనాలు అందించాలని వినతి

తెనాలి అర్బన్, జూలై 22: వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు ఇచ్చేలా చూడాలని రైతు సంఘం సభ్యులు సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వర్షాల వలన తెనాలి డివిజన్‌లో పొలాల పరిస్థితిని వివరించారు. అనంతరం రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, కాల్వలు, డ్రెయిన్లు, గుర్రపు డెక్కతో పూడుకుపోయాయని గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వీటివంక చూసిన పాపాన పోలేదన్నారు. దీనివలన వర్షపు నీరు కాల్వలోకి వెళ్లకుండా చెరువులు, కాల్వలు ఏకం కావడంతో వెదసాగు చేపట్టిన రైతులతో పాటు నారుపోసిన విత్తనాలు కూడా నీట మునిగి రైతులు నష్టపోయారని చెప్పారు. గత రబీలో నష్టపోయిన జొన్న రైతులకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వేజండ్ల రోశయ్య, షేక్ మస్తాన్, మహబూబ్‌ఖాన్, నాగేశ్వరరావు, సుమంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శాకాంబరిదేవి అలంకారంలో కొలకలూరు గంగానమ్మ, గంగాపార్వతి అమ్మవారు

శాకంబరిదేవిగా అమ్మవారు

తెనాలి రూరల్, జూలై 22: మండలంలోని కొలకలూరులో గ్రామ దేవత గంగానమ్మతల్లి, అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలోని శ్రీ గంగాపార్వతి అమ్మవార్లు శాకాంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

● మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట జూలై 22: పట్టణ ప్రజలు పరిశరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల ఆదేశించారు. స్థానిక చెంచుపేటలో సోమవారం డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల నిర్వహించారు. బేకరీ నిర్వాహకులు తినుబండరాలపై కవర్లను కప్పాలని ఆదేశించారు. నిల్వఉన్న ఆహార పదార్థాలను అమ్మరాదని, ఈగలు, దోమలు రాకుండా చూడాలన్నారు. పట్టణ ప్రజలు కాచిచల్లార్చిన నీటిని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో డయేరియాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పాత్రలోకి జగన్ పరకాయ ప్రవేశం

● మైనార్టీలపై వైసీపీ పాలనలో జరిగిన దాడుల సంగతేంటి

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ మోసిన్

పెదకాకాని, జులై 22: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కొత్త పాత్రలో పరకాయ ప్రవేశం చేశారని, వినుకొండలో రౌడీషీటర్లు హత్యకు పాల్పడితే జగన్ పరామర్శ విడ్డూరంగా ఉందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ మోసిన్ ఆరోపించారు. సోమవారం పెదకాకాని మండల పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మోసిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలపై వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగీన దాడుల సంగతి ఏంటని ప్రశ్నించారు. వినుకొండలో ఇద్దరు రౌడీ షీటర్లు గొడవపడితే దానికి నువ్వువెళ్లి పరామర్శించడం శవ రాజకీయాలు కాదా అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌రెడ్డి పాలనలో 1586 మందిపై దాడులు జరిగాయని వాటికి తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేసిన జగన్ మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్‌కు వినతిపత్రం అందచేస్తున్న పొన్నూరు నియోజకవర్గ జర్నలిస్టులు

జర్నలిస్టులపై అనుచిత వాఖ్యలు గర్హనీయం

పొన్నూరు టౌన్, జూలై 22: వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, మీడియా, మీడియా ప్రతినిధులపై అనుచిత వాఖ్యలు చేయటం గర్హనీయం అని పొన్నూరు నియోజకవర్గ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఎండి షరీఫ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్ సూర్యనారాయణసింగ్‌కు జర్నలిస్టు సంఘాల నాయకులు వినతిపత్రం అందచేశారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ విజయసాయిరెడ్డి మీడియా నిర్వాహకులతో పాటు మీడియా ప్రతినిధులపై అనుచిత వాఖ్యలు చేశారని ఆరోపించారు. జర్నలిస్టులను బెదిరించే ధోరణితో వ్యవహరించి తమ హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించారని ఆరోపించారు. ఎంపీ విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీపై ఫిర్యాదు

చేబ్రోలు, జూలై 22: చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం వద్ద శివాలయంలో జరిగిన చోరీపై సోమవారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శివాలయంలో రెండు హుండీలను పగలకొట్టి నగదు దొంగలించటమే కాకుండా ఆలయంలోని పార్వతి అమ్మవారి బంగారు మంగళ సూత్రం, వెండి నాగపడిగ చోరీ అయినట్లు ఆలయ పూజారి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాల కోసం శోధిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

● మండల వ్యవసాయాధికారి వెంకట్రావు

కొల్లిపర, జూలై 22: అధిక వర్షాలు కారణంగా మండలంలో పలుచోట్ల వెద పద్ధతి ద్వారా వేసిన నాట్లు నీట మునిగాయని వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు రైతులు పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపించాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర, సిరిపురం తదితర గ్రామాల్లో వెద పద్ధతి ద్వారా వేసిన వరినాట్లను ఆయన పరిశీలించారు. రైతులకు వెద పద్ధతిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వెద పద్ధతి ద్వారా వేసిన నాట్లు మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించినట్లయితే మొలక రావటానికి అవకాశం ఉందన్నారు. వెద పద్ధతి ద్వారా వేసిన నాట్లు 10 నుంచి 30 రోజుల వయస్సులో ఉన్నట్లు అయితే వర్షాలు తగ్గిన తర్వాత నీటిని పూర్తిగా బయటకు పంపి ఎకరానికి ఒక బస్తా డీఏపీ, 25కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు.

లయిన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా పరాశరం రంగవల్లి

పొన్నూరు టౌన్, జూలై 22: లయిన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా పొన్నూరు పట్టణానికి చెందిన బీజేపీ నాయకురాలు పరాశరం రంగవల్లి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన లయిన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా సమావేశంలో పరాశరం రంగవల్లీని జోన్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా పరాశరం రంగవల్లిని జిల్లా గవర్నర్ పర్చూరి గోపీచంద్, మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశ్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.అనుసూయ దేవి, పి.శేషకుమారి, బి.సభలాదేవి, జి.కృష్ణకుమారి తదితరులు అభినందించారు.

నాగిరెడ్డిని పరామర్శించిన ప్రజా సంఘాల నాయకులు

కొల్లిపర, జూలై 22: అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు గుడిబండి నాగిరెడ్డిని కొల్లిపరలోని ఆయన స్వగృహంలో సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ కాటా ప్రమీల, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, బ్యాంకు ఉద్యోగ సంఘ నాయకుడు కొల్లి శివనాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



రాయితీపై కందిపప్పును పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

రాయితీ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

తహసీల్దార్ శ్రీనివాసులు

కొల్లిపర, జూలై 22: రాయితీపై ఇస్తున్న కందిపప్పు కేంద్రాలను పేదప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు కందిపప్పు కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కందిపప్పు మార్కెట్‌లో రూ.181లు వరకు ఉందని దానిని రూ.160లకు సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ జేవీఎస్ఎన్ మూర్తి, నాయకులు గుడిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.